# చాంపియన్ హంపి



పూణె: భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఫిడే ఉమెన్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో చాంపియన్‌గా నిలిచింది. బుధవారం జరిగిన చివరిదైన 9వ రౌండ్‌లో హంపి.. నుర్గ్యుల్ సలిమోవా (బల్గేరియా)ను ఓడించి ఏడు పాయింట్లతో స్వర్ణం గెలిచింది. ఆఖరి రౌండ్‌లో తెల్ల పావులతో బరిలోకి దిగిన హంపి.. ప్రత్యర్థి ఎలాంటి సంచలనాలకూ తావివ్వకుండా గేమ్‌ను ముగించింది. ఇక తొమ్మిదో రౌండ్‌లో చైనా అమ్మాయి జినర్ కూడా గెలిచి.. హంపితో సమానంగా ఏడు పాయింట్లు సాధించినప్పటికీ ట్రైబ్రేక్ రికార్డుతో భారత గ్రాండ్‌మాస్టర్ చాంపియన్‌గా నిలిచింది. భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్ మూడోస్థానంలో నిలవగా ద్రోణవల్లి హారిక నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

# జింబాబ్వే సంచలన విజయం

**తొలి టెస్టులో బంగ్లాకు షాక్**





సిల్హెట్: బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న జింబాబ్వే.. ఆతిథ్య జట్టుకు అనూహ్య షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా సిల్హెట్ వేదికగా బుధవారం ముగిసిన తొలి టెస్టులో జింబాబ్వే.. 3 వికెట్ల తేడాతో సంచలన విజయం నమోదుచేసింది. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి ఛేదించిన జింబాబ్వేకు 2021 తర్వాత టెస్టులలో ఇదే తొలి గెలుపు . ఛేదనలో ఓపెనర్లు బెన్నెట్ (54), బెన్ కరన్ (44) తొలి వికెట్‌కు 95 పరుగులు జోడించి ఆ జట్టు విజయానికి బలమైన పునాది వేశారు. అయితే మెహిది హసన్ మిరాజ్ స్పిన్ మాయ (5/50)తో జింబాబ్వే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కానీ వెస్లీ (19 నాటౌట్), రిచర్డ్ ఎంగర్వ (4 నాటౌట్) మరో వికెట్ పడకుండా పర్యాటక జట్టు విజయాన్ని ఖాయం చేశారు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 191 పరుగులకు ఆలౌట్ అవగా జింబాబ్వే 273 రన్స్ చేసింది. బదులుగా బంగ్లాదేశ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో 255 రన్స్ చేసి జింబాబ్వే ఎదుట 174 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. ఈ మ్యాచ్‌లో 9 వికెట్లు తీసిన జింబాబ్వే బౌలర్ ముజర్‌బనికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# ఆందోళన పడాల్సిన అవసరం లేదు

## సీఎస్‌కే సీఈవో



చెన్నై: ఐపీఎల్-18లో ఘోరంగా విఫలమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ ఆటతీరుపై ఆందోళన పడాల్సిన అవసరమేమీ లేదంటున్నాడు సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్. ఈ సీజన్‌లో ఆడిన 8 మ్యాచ్‌లకు గాను ఆరింట్లో ఓడిన చెన్నై రెండింట్లో మాత్రమే విజయం సాధించింది. ప్రస్తుతం ఆ జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి అనధికారికంగా నిష్క్రమించినట్టే. ఈ నేపథ్యంలో విశ్వనాథన్ మాట్లాడుతూ.. 'ఈ సీజన్‌లో మేం ఆశించినస్థాయిలో రాణించలేకపోయాం. రాబోయే మ్యాచ్‌లలో మేం మెరుగ్గా రాణిస్తాం. వరుసగా మ్యాచ్‌లు ఓడిపోవడంతో ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదు. ఇది జస్ట్ ఒక గేమ్' అని అన్నాడు.

## యువ బాక్సర్ల జోరు

అమ్మాన్ (జోర్డాన్): ఏషియన్ అండర్-15, 17 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో యువ భారత బాక్సర్లు జోరు కొనసాగిస్తున్నారు. బుధవారం జరిగిన పురుషుల అండర్-15 క్వార్టర్స్‌లోని వివిధ కేటగిరీల్లో గెలిచిన ఐదుగురితో పాటు ఒక మహిళా బాక్సర్ సెమీస్‌కు ప్రవేశించింది. పురుషుల విభాగంలో రుద్రాక్ష్ సింగ్ (46 కిలోలు), సంచిత్ జయాని (49 కి.), ప్రీక్షిత్ (40 కి.), హర్సిల్ (37 కి.), సంస్కార్ వినోద్ (35 కి.) తమ ప్రత్యర్థులను మట్టికరిపించి సెమీస్‌కు చేరారు. మహిళల 43 కిలోల విభాగంలో మిల్కీ.. 5-0తో యెల్దన (కజకిస్థాన్)ను చిత్తు చేసింది.

## పోల్‌వాల్ట్‌లో సరికొత్త జాతీయ రికార్డు



కొచ్చి: కేరళలో జరుగుతున్న నేషనల్ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ కాంపిటీషన్-2025లో భాగంగా పోల్‌వాల్ట్ క్రీడలో సరికొత్త జాతీయ రికార్డు నమోదైంది. పురుషుల విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన దేవ్‌కుమార్ మీనా.. 5.35 మీటర్లు ఎత్తుకు దూకాడు. తద్వారా గతంలో తన పేరిటే ఉన్న (5.32 మీటర్ల) రికార్డును బ్రేక్ చేసి స్వర్ణం సాధించాడు. ఈ పోటీలలో తమిళనాడు అథ్లెట్లు గౌతమ్ (5.15 మీటర్లు), రీగన్ (5.10 మీటర్లు) వరుసగా రజతం, కాంస్యం గెలుచుకున్నారు.

## పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| గుజరాత్ | 8 | 6 | 2 | 12 | 1.10 |
| ఢిల్లీ | 8 | 6 | 2 | 12 | 0.65 |
| ముంబై | 9 | 5 | 4 | 10 | 0.67 |
| బెంగళూరు | 8 | 5 | 3 | 10 | 0.47 |
| పంజాబ్ | 8 | 5 | 3 | 10 | 0.17 |
| లక్నో | 9 | 5 | 4 | 10 | -0.05 |
| కోల్‌కతా | 8 | 3 | 5 | 6 | 0.21 |
| రాజస్థాన్ | 8 | 2 | 6 | 4 | -0.63 |
| హైదరాబాద్ | 8 | 2 | 6 | 4 | -1.36 |
| చెన్నై | 8 | 2 | 6 | 4 | -1.39 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# రైజర్స్ బొక్కబోర్లా

## హైదరాబాద్‌పై ముంబై ఘనవిజయం • కాటేరమ్మ కొడుకుల మరో ఫ్లాప్ షో

## ఆదుకున్న క్లాసెన్ • హార్దిక్ సేనకు ఐదో విజయం



రోహిత్ (70)

**సంక్షిప్త స్కోర్లు:**

హైదరాబాద్: 20 ఓవర్లలో 143/8 (క్లాసెన్ 71, అభినవ్ 43, బౌల్ట్ 4/26, చాహర్ 2/12)
ముంబై: 15.4 ఓవర్లలో 146/3 (రోహిత్ 70, సూర్య 40, ఉనద్కత్ 1/25, అన్సారీ 1/36)

**స్టేడియం హాజరు: 36,171**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వరుస పరాభవాలు ఎదురవుతున్నా ఐపీఎల్-18లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఆటతీరులో మార్పు రావడం లేదు. ప్రత్యర్థుల వేదికలతో పాటు సొంత మైదానంలోనూ సన్‌రైజర్స్ బొక్కబోర్లా పడుతున్నది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే గెలుపు బాట పట్టాల్సిన మ్యాచ్‌లో హైదరాబాద్ మరోసారి బ్యాటింగ్ వైఫల్యంతో చేతులెత్తేసింది. ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్.. ఆతిథ్య జట్టును 7వికెట్ల తేడాతో ఓడించింది. తద్వారా ఈ సీజన్‌లో ఐదో విజయాన్ని నమోదుచేసి ప్లేఆఫ్స్ రేసులో మరో ముందడుగు వేసింది. హెన్రిచ్ క్లాసెన్ (44 బంతుల్లో 71, 9 ఫోర్లు, 2 సిక్సర్లు), అభినవ్ మనోహర్ (43) ఆదుకోవడంతో మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్.. నిర్ణీత ఓవర్లలో 143/8 స్కోరు చేసింది. ట్రెంట్ బౌల్ట్ (4/26), దీపక్ చాహర్ (2/12) ఎస్ఆర్‌హెచ్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. ఛేదనను ముంబై 15.4 ఓవర్లలోనే పూర్తిచేసింది. రోహిత్ శర్మ (46 బంతుల్లో 70, 8 ఫోర్లు, 3 సిక్సర్లు) మరో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. ఈ సీజన్‌లో ఆడిన 8 మ్యాచ్‌లలో ఎస్ఆర్‌హెచ్‌కు ఇది ఆరో ఓటమి. ప్రస్తుత పరిస్థితుల్లో హైదరాబాద్ ప్లేఆఫ్ ఆశలు అడుగంటినట్టే!

### టాపార్డర్ టపటప

ఎస్ఆర్‌హెచ్ అభిమానులు కాటేరమ్మ కొడుకులుగా పిలుచుకునే సన్‌రైజర్స్ బ్యాటర్ల వైఫల్యం ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. 2025లో ఘోరంగా విఫలమవుతున్న ట్రావిస్ హెడ్ అదే వైఫల్యాన్ని కొనసాగిస్తూ డకౌట్ అయ్యాడు. బౌల్ట్ రెండో ఓవర్లోనే హెడ్‌ను ఔట్ చేసి ఎస్ఆర్‌హెచ్ పతనానికి నాంది పలికాడు. అతడే తన మరుసటి ఓవర్లో అభిషేక్ (8)నూ పెవిలియన్‌కు పంపాడు. చాహర్ మూడో ఓవర్లో.. ఇషాన్ కిషన్ (1) అత్యుత్సాహానికి పోయి పెవిలియన్ చేరాడు. నితీశ్ రెడ్డి (2), అనికేత్ వర్మ (12) కూడా వారి బాటనే అనుసరించారు. 6 ఓవర్లలో సన్‌రైజర్స్ స్కోరు 24/4. 2025 సీజన్ పవర్ ప్లేలో ఇదే అత్యంత చెత్త స్కోరు.

### క్లాసెన్ పోరాటం

35/5తో తీవ్ర కష్టాల్లో ఉన్న సన్‌రైజర్స్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగిందంటే అది క్లాసెన్ పోరాటం చలవే. క్రీజులో కుదురుకున్నాక క్లాసెన్.. బ్యాట్‌కు పనిచెప్పాడు. విఘ్నేశ్ 10వ ఓవర్లో 6, 4, 4తో ఎస్ఆర్‌హెచ్‌ను 50 పరుగుల మార్కును దాటించాడు. హార్దిక్ ఓవర్లో మూడు బౌండరీలు దంచిన క్లాసెన్ 34 బంతుల్లో అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. ఈ సీజన్‌లో అతడికిదే తొలి ఫిఫ్టీ. హెడ్ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన మనోహర్.. క్లాసెన్‌కు అండగా నిలవడంతో సన్‌రైజర్స్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది.

### ముంబై అలవోకగా..

సన్‌రైజర్స్ తడబడ్డ పిచ్‌పై ముంబై లక్ష్యాన్ని సాఫీగా దంచేసింది. బౌండరీతో ఛేదన ప్రారంభించిన రికెల్టన్ (11) త్వరగానే పెవిలియన్ చేరినా చెన్నై మ్యాచ్‌తో ఫామ్‌లోకి వచ్చిన ముంబైచా రాజా (రోహిత్).. అదే జోరును కొనసాగించాడు. కమిన్స్ 3వ ఓవర్లో 6, 4 బాదిన హిట్‌మ్యాన్.. ఉనద్కత్ బౌలింగ్‌లోనూ 4, 6 దంచాడు. మరో ఎండ్‌లో విల్ జాక్స్ (22) రోహిత్‌కు అండగా నిలవడంతో ముంబై స్వల్ప లక్ష్యాన్ని వేగంగా కరిగించింది. కమిన్స్ బౌలింగ్లో బౌండరీతో 35 బంతుల్లో రోహిత్ ఫిఫ్టీ పూర్తయింది. పదో ఓవర్లో అన్సారీ.. జాక్స్‌ను ఔట్ చేసినా ఆ ప్రభావం ముంబైపై పడలేదు. సూర్యకుమార్ (40) సాయంతో రోహిత్.. ముంబై విజయాన్ని ఖాయం చేశాడు. విజయానికి 13 పరుగుల దూరంలో రోహిత్ ఔటైనా సూర్య, తిలక్ లాంఛనాన్ని పూర్తిచేశారు.



**నివాళి:**

మ్యాచ్‌కు ముందు పహల్గాం ఉగ్రదాడిలో కన్నుమూసినవారికి బీసీసీఐ ఘనంగా నివాళి అర్పించింది. ఉగ్రదాడిని ఇరు జట్ల కెప్టెన్లు ముక్తకంఠంతో ఖండించగా మ్యాచ్‌లో ఆటగాళ్లు, అంపైర్లతో పాటు కామెంటేటర్లూ నల్లబ్యాడ్జ్‌లు ధరించి బాధిత కుటుంబాలకు సంఘీభావం ప్రకటించారు. ఆట ఆరంభానికి ముందు స్టేడియంలో ప్రేక్షకులతో పాటు అందరూ ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ మ్యాచ్‌లో చీర్ లీడర్స్‌కు, డీజేలకు అనుమతినివ్వలేదు.

# క్రీడా స్ఫూర్తా..! తెలివి తక్కువతనమా?





మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఔట్ అయిన తీరు అందర్నీ ఆశ్చర్యపరిచింది. బౌలింగ్ టీమ్ నుంచి ఒక్కరు కూడా అప్పీల్ చేయకున్నా.. అంపైర్ అత్యుత్సాహంతో చేయి లేపాలా.. వద్దా? అని సంశయిస్తున్న తరుణంలో ఇషాన్.. తానేదో గొప్ప త్యాగం చేసినట్టుగా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ క్రీజును వదిలాడు. కానీ టీవీ రిప్లై చూశాక గానీ అర్థం కాలేదు తాను తప్పులో కాలేశానని! అసలే ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో సెంచరీని మినహాయిస్తే కనీసం డబుల్ డిజిట్ స్కోరు చేయడానికీ నానా తంటాలు పడుతున్న ఇషాన్.. ముంబై మ్యాచ్‌లో అయినా రాణిస్తాడని అంతా ఆశించారు. కానీ విధి మరోలా తలచింది. అసలేం జరిగిందంటే.. ట్రావిస్ హెడ్ నిష్క్రమించిన తర్వాత ఇషాన్ క్రీజులోకి వచ్చాడు. చాహర్ మూడో ఓవర్‌లో తొలి బంతిని లెగ్ సైడ్ దిశగా సంధించాడు. దానిని ఇషాన్ ఆడబోయినా బంతి అది కాస్తా మిస్ అయి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. కీపర్ రికెల్టన్ బంతినందుకున్నాక యథావిధిగా దానిని ఇతరులకు పాస్ చేశాడు. చాహర్ కూడా మరో బంతి వేయడానికి వెళ్తున్నాడు. ముంబై ఫీల్డర్లూ స్తబ్దుగానే ఉండగా అంపైర్.. చేతిని కాస్త పైకి లేపి 'ఎవరూ అప్పీల్ చేయరేంటి?' అన్నట్టుగా అటూఇటూ చూస్తూ ఔట్ ఇవ్వాలా? వద్దా? అని సంశయించాడు. అంపైర్ అత్యుత్సాహాన్ని గమనించిన చాహర్ పూర్తిగా అప్పీల్ చేయకముందే అప్పటికే సగం లేచి ఉంచిన చేతిని పూర్తిగా లేపి 'ఔట్' అని ప్రకటించి తన భారం దించుకున్నాడు. ఈ క్రమంలో ఇషాన్.. బంతి బ్యాట్‌కు తాకి ఉండొచ్చన్న అపనమ్మకంతో పెవిలియన్ దిశగా నడిచాడు. కనీసం రివ్యూ కూడా తీసుకోలేదు. అదే సమయంలో అక్కడే ఉన్న ముంబై ఆటగాళ్లు.. మనోడి క్రీడా స్ఫూర్తిని మెచ్చుకున్నారు. కానీ టీవీ రిప్లైలో బంతి అసలు బ్యాట్‌కు తాకనే లేదని స్పష్టంగా తేలింది. దీంతో ఇషాన్‌ది క్రీడా స్ఫూర్తా? లేక తెలివితక్కువతనమో అర్థం కాక సన్‌రైజర్స్ అభిమానులు జుట్టు పీక్కున్నారు.

# భూతల స్వర్గాన్ని నరకంగా మార్చారు

## పహల్గాం దాడి ఘటనపై సినీ ప్రముఖుల ఆవేదన



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడి యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రకృతి అందాల నడుమ సేద తీరుతున్న అమాయక పర్యాటకులను నిర్దాక్షిణ్యంగా పొట్టనపెట్టుకున్న తీరు అందరి హృదయాల్ని కలచివేసింది. ఈ అమానవీయ దాడి ఘటనపై సినీ ప్రముఖులు స్పందించారు. ముష్కరుల దాడిలో అసువులు బాసిన వారికి సోషల్‌మీడియా వేదికగా సంతాపం తెలిపారు. ఇది అత్యంత క్రూరమైన చర్య అని, తీవ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

- 28 మంది అమాయకులను బలిగొన్న ఈ దాడి హృదయ విదారకరమైనది. క్షమించరాని క్రూరమైన చర్య. మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా -చిరంజీవి
- 'ఇది చీకటి రోజు. పహల్గాం ఘటన కలచివేస్తున్నది. ఇలాంటి క్రూరత్వానికి వ్యతిరేకంగా పోరాడే శక్తి మనందరికి లభిస్తుందని ఆశిస్తున్నా. ఈ విషాదం నుంచి మృతుల కుటుంబాలు బయటపడాలని దేవున్ని ప్రార్థిస్తున్నా' -మహేష్‌బాబు
- బాధితులను తలచుకుంటే నా హృదయం బరువెక్కుతున్నది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆ కుటుంబాలకు న్యాయం జరగాలని, శాంతి కోసం ప్రార్థిస్తున్నా - ఎన్టీఆర్.
- మాటల్లో చెప్పలేని విషాద ఘటన ఇది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. దేశం మొత్తం ఒక్కతాటిపై నిలిచి ఇలాంటి అమానవీయ చర్యలపై పోరాటం చేయాలి - షారుఖ్‌ఖాన్.
- ఈ భువిపై స్వర్గం వంటి అందమైన కశ్మీర్‌ను ముష్కరులు నరకంగా మార్చారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం పిరికిపందల చర్య. మృతుల కుటుంబాలకు నా సానుభూతి. ఒక్క అమాయకుడి ప్రాణాలు బలిగొనడం అంటే ఈ విశ్వం మొత్తాన్ని ధ్వంసం చేసినట్లే - సల్మాన్‌ఖాన్.
- పహల్గాం ఎంతో అందమైన ప్రదేశం. ఈ దాడి గురించి తెలిసి నా హృదయం ముక్కలైంది. బాధిత కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా - అల్లు అర్జున్
- రెండేళ్ల క్రితం నా పుట్టిన రోజును పహల్గాంలో జరుపుకున్నా. ఓ సినిమా షూటింగ్ కోసం అక్కడకు వెళ్లా. నిన్న జరిగిన దాడి ఘటన తెలుసుకొని నా హృదయం వికలమైంది. సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం సిగ్గుచేటు. భారతదేశం ఉగ్రవాదానికి ఎన్నటికీ తలవంచదు. ఇలాంటి పిరికివాళ్లను త్వరలో అంతమొందిస్తారని ఆశిస్తున్నా. - విజయ్ దేవరకొండ.

వీరితో పాటు పలువురు టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులు పహల్గాం దాడి ఘటనను ఖండించారు. కమల్ హాసన్, సంజయ్‌దత్, అక్షయ్‌కుమార్, మమ్ముట్టి, హృతిక్‌రోషన్ జాన్వీకపూర్, సోనూసూద్, ప్రియాంక చోప్రా, కంగనారనౌత్, అలియాభట్ తదితరులు తమ సోషల్‌మీడియా ఖాతాల ద్వారా మృతుల కుటుంబాలను సానుభూతిని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

**చిత్రం**

# సూర్యతో జోడీగా..



గత రెండేళ్లుగా తెలుగు సినిమాలు బ్రేక్‌నిచ్చింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. ప్రస్తుతం ఈ భామ తమిళ ఇండస్ట్రీపై ఎక్కువగా దృష్టి పెడుతున్నది. తాజాగా ఆమె తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంలో ఓ భారీ ఆఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. 'లక్కీ భాస్కర్'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. త్వరలో ఆయన తమిళ అగ్ర హీరో సూర్యతో ఓ సినిమా చేయబోతున్నారు. మారుతీ కార్లకు సంబంధించిన నేపథ్య కథాంశంతో తెరకెక్కించనున్న బయోపిక్ ఇదని సమాచారం. '796 సీసీ' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో కథానాయికగా చాలా మంది పేర్లు వినిపించాయి. తాజా సమాచారం ప్రకారం కీర్తి సురేష్‌ను ఫైనల్ చేసే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ భారీ వ్యయంతో తెరకెక్కించనుంది. మే రెండో వారం నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలుకానుందని సమాచారం.

# గ్రహాలు అనుకూలించాలి!



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన మైథాలజికల్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించింది. ప్రస్తుతం ఈ సినిమా సీక్వెల్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. తాజాగా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు నాగ్‌అశ్విన్ 'కల్కి-2' విడుదల గురించి సరదాగా వ్యాఖ్యానించారు. 'కల్కి-2' ఎప్పుడు రిలీజ్ చేస్తారనే ప్రశ్నకు బదులిస్తూ ''కల్కి' చిత్రాన్ని 3,4 గ్రహాలు ఒకే వరుసలో ఉన్నప్పుడు విడుదల చేశాను. సీక్వెల్‌ను 7,8 గ్రహాలు ఒకే వరుసలో వచ్చినప్పుడు రిలీజ్ చేస్తా. మీరంతా కాస్త వేచి చూడండి' అంటూ సరదాగా స్పందించారు. ప్రస్తుతం 'కల్కి-2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని, ఈ సంవత్సరాంతంలో సెట్స్‌పైకి వెళ్తుందని, భైరవ, కర్ణ పాత్రల కోణంలోనే సీక్వెల్ సాగుతుందని తెలిపారు. 'కల్కి' చిత్రీకరణలోనే 'కల్కి-2'కు సంబంధించిన కొంత భాగాన్ని షూట్ చేశామని గతంలోనే మేకర్స్ ప్రకటించారు. వైజయంతి మూవీస్ పతాకంపై అశ్వనీదత్ నిర్మించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద వెయ్యి కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది.



# బాక్సింగ్ నేపథ్యంలో 'జింఖానా'

'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మలయాళీ హీరో నస్లెన్ గఫూర్ నటించిన తాజా చిత్రం 'జింఖానా'. ఖలీద్ రెహమాన్ దర్శకుడు. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ స్పోర్ట్స్ డ్రామాను శ్రీలక్ష్మి నరసింహ మూవీ మేకర్స్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నది. మంగళవారం నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకకు ప్రముఖ దర్శకుడు హరీష్‌శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ సినిమా మలయాళంలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిందని, నస్లెన్ అద్భుతమైన పర్ఫార్మెన్స్ కనబరిచాడని, దర్శకుడు ఖలీద్ రెహమాన్ బాక్సర్ కాబట్టి అదే నేపథ్యంలో అద్భుతంగా చిత్రాన్ని తీశాడని ప్రశంసించారు. స్పోర్ట్స్ కామెడీ చిత్రమిదని, మంచి యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు అలరించే పాటలుంటాయని దర్శకుడు ఖలీద్ రెహమాన్ తెలిపారు. ఈ సినిమాలో అందరూ హీరోలేనని, అద్భుతమైన హాస్యంతో ఆకట్టుకుంటుందని హీరో నస్లెన్ అన్నారు. భారీస్థాయిలో విడుదల చేయబోతున్నామని నిర్మాత తెలిపారు.



# తిరుపతి పాత్ర గుర్తుండిపోతుంది

ఇటీవల విడుదలైన 'ఓదెల-2' చిత్రంలో ప్రతినాయకుడు తిరుపతి పాత్రలో ప్రేక్షకుల్ని మెప్పించారు కన్నడ నటుడు వశిష్ట ఎన్ సింహ. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి సంపత్‌నంది క్రియేటర్‌గా వ్యవహరించగా, అశోక్‌తేజ దర్శకత్వం వహించారు. ఈ నేపథ్యంలో సినిమాలో తన పాత్రకు వస్తున్న స్పందన గురించి బుధవారం పాత్రికేయులతో ముచ్చటించారు నటుడు వశిష్ట ఎన్ సింహ. ఆయన మాట్లాడుతూ 'ఓదెల-2' సినిమాలో ఈవిల్ క్యారెక్టర్ కోసం స్పెషల్ వాయిస్ మాడ్యులేషన్ ప్రాక్టీస్ చేశా. నా గొంతు బాగా ప్లస్ అయింది. సంపత్‌నంది ఈ సినిమా కాన్సెప్ట్ చెప్పినప్పుడే చాలా సర్‌ప్రైజ్ అయ్యా' అన్నారు. తిరుపతి పాత్ర సీన్‌లో ఉన్నా లేకపోయినా సినిమా మొత్తం అతని నామస్మరణతోనే నిండిపోయిందని, తిరుపతి ఒరకంగా సినిమాకు హీరోలా నిలిచాడని, ఆ పాత్ర ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయిందని వశిష్ట ఎన్ సింహ తెలిపారు. ఈ సినిమాలో తన పర్ఫార్మెన్స్ చూసి పెద్ద బ్యానర్ల నుంచి అవకాశాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

# 'ఆర్‌ఎక్స్ 100' మిస్సయ్యింది!



'చౌర్య పాఠం' చిత్రం ద్వారా హీరోగా పరిచయమవుతున్నాడు ఇంద్రా రామ్. నిఖిల్ గొల్లమారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి నక్కిన త్రినాథరావు నిర్మాత. ఈ నెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరో ఇంద్రా రామ్ బుధవారం పాత్రికేయులతో ముచ్చటించారు. తాను ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేశానని, జిమ్నాస్టిక్స్, డ్యాన్స్‌లలో ప్రవేశం ఉందని అన్నారు. ఒక వీధిలో బ్యాంక్ ఉంటే మరో వీధిలో రూమ్ తీసుకొని అక్కడి నుంచి టన్నెల్ తవ్వి బ్యాంక్‌లో దోపిడి చేసిన నిజ జీవిత ఘటన ఆధారంగా ఈ కథను తయారుచేశారని తెలిపారు. ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర ఈ సినిమా కోసం ఫిక్షనల్ విలేజ్‌ను క్రియేట్ చేశారని చెప్పారు. 'ఆర్‌ఎక్స్ 100' సినిమాలో తాను హీరోగా నటించాల్సిందని, అనుకోని కారణాల వల్ల అది మిస్ అయ్యిందని, ఈ చిత్రంలో కార్తికేయ అద్భుతంగా నటించారని ఇంద్రా రామ్ అన్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.